సాక్షి విశాఖపట్నం

మంగళవారం। 16। జూలై। 2024



అర్జీలను పరిష్కరించండి

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను తక్షణం పరిష్కరించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. 8లో



నగరంలో భారీ వర్షం

నగరంలో సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణం చల్లగా ఉండడంతో ప్రజలు సేదదీరారు. 8లో



విశాఖలో 'పేకమేడలు' సందడి

పేకమేడలు సినిమా యూనిట్ విశాఖలో సందడి చేసింది. హీరోహీరోయిన్లు వినోద్ కిషన్, అనూష మీడియాతో మాట్లాడారు. 8లో

న్యూస్‌రీల్

తుది విడత చందనం అరగదీత



చందనాన్ని అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సోమవారం నుంచి తుది విడత చందనం అరగదీత(ఆఖరి విడత) ఘనంగా ప్రారంభమైంది. ఈనెల 21న ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని ఆరోజు స్వామికి సమర్పించేందుకు అవసరమైన మూడు మణుగుల పచ్చిచందనం(120కిలోలు) అరగదీత చేపట్టారు. ఉదయం 7 గంటల నుంచి నాల్గవ తరగతి సిబ్బంది చందనం అరగదీతను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. కాగా ఏడాదిలో నాలుగు విడతలుగా స్వామికి మూడేసి మణుగుల చొప్పున(120 కిలోల చొప్పున) పచ్చి చందనం సమర్పిస్తారు. చందనోత్సవం రోజు రాత్రి, వైశాఖ పౌర్ణమి, జ్యేష్ట పౌర్ణమి, ఆషాఢ పౌర్ణమి రోజుల్లో తెల్లవారుజామున మూడేసి మణుగుల చొప్పున చందనాన్ని సమర్పిస్తారు. ఇప్పటికే గత చందనోత్సవం, వైశాఖ పౌర్ణమి, జ్యేష్ట పౌర్ణమి రోజుల్లో మూడు విడతల చందనం సమర్పణ పూర్తయింది. ఆఖరి విడతగా ఈనెల 21న సమర్పిస్తారు.

రామావతారంలో జగన్నాథుడు



స్వామి వారికి పట్టువస్త్రాలు అందిస్తున్న రామతీర్థం ఆలయ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: జగన్నాథుడి రథోత్సవాలు నగరంలో కనులపండువగా జరుగుతున్నాయి. టర్నర్ చౌల్ట్రీ వద్ద సోదరుడు బలభద్రుడు, సోదరి సుభద్రతో కొలువుదీరిన స్వామి సోమవారం రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు తరలిరాగా వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, లలిత, విష్ణుసహస్రనామ పారాయణాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. విజయనగరం జిల్లా రామతీర్థం నుంచి ఆలయ ప్రతినిధులు స్వామికి పట్టువస్త్రాలు ఆలయ ఈవో రాజగోపాల్‌రెడ్డికి అందజేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు యేడిద సురేష్‌బాబు, పాణంగిపల్లి జగన్నాథాచార్యులు, పాణంగిపల్లి రంగన్నాథాచార్యులు కేశవాచార్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ కనెక్షన్ కోసం 1912కి కాల్ చేయండి



సాక్షి, విశాఖపట్నం : కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కావల్సిన రైతులు టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయవచ్చని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని వివిధ మీ-సేవా కేంద్రాలు, గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతోందన్నారు. ఈ కార్యాలయాల్లో కొత్త వ్యవసాయ కనెక్షన్ల నమోదు సమయంలో పత్రాలను అప్‌లోడ్ చేసే సమయంలో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు. అందుకే రైతులు నేరుగా ఏపీఈపీడీసీఎల్ కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రైతులు తమ ఆధార్ నంబర్, రిజిస్టర్డ్ ఫోన్ నంబర్, పట్టాదార్ పాస్ బుక్ నంబర్, సర్వే నంబర్, వాల్టా సర్టిఫికెట్ నంబర్, కులధృవీకరణ పత్రం వంటి వివరాలను తెలియచేయాలన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కావలసిన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు సర్కిళ్ల పరిధిలోని వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నంబరు ప్లేట్ మార్చితే చర్యలు తప్పవు

బీచ్‌రోడ్డు : వాహనాలకు ఉన్న హై సెక్యూరిటీ నంబరు ప్లేట్ మార్చితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణా శాఖ కమిషనర్ రాజారత్నం ఒక ప్రకటనలో తెలిపారు. హై సెక్యూరిటీ నంబరు ప్లేట్ కాకుండా వేరే నంబరు ప్లేట్ ఏర్పాటు చేసి దానిపై ఎమ్మెల్యే తాలుకా, మంత్రి తాలుకా అంటూ రాస్తే భారీ చలానాలు చెల్లించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఇలా నంబరు ప్లేట్ మార్చిన 22 మంది వాహనదారులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మోటర్ వాహన నిబంధనలు పాటిస్తూ రవాణా శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

బాబు నాటకం భృతి ఓ బూటకం

- ఇంటికో ఉద్యోగమంటూ ఊదరగొట్టిన చంద్రబాబు
- లేదంటే నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ
- నెల రోజులు దాటినా ఊసెత్తని కూటమి ప్రభుత్వం
- విశాఖలో 5 లక్షల ఇళ్లల్లో 2 లక్షల మంది నిరుద్యోగులు



'ఎవరికైనా ఉద్యోగాలొచ్చాయా తమ్ముళ్లూ..? రాలేదు కదా.. కొంతమందికి ఉద్యోగాలిచ్చారు.. మూటలు మోసే ఉద్యోగం.. అవీ ఒక ఉద్యోగాలేనా.? నేను సీఎం అయిన వెంటనే.. ఇంటికో ఉద్యోగమిస్తా.. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు అందిస్తాను.. ఎవరూ భయపడొద్దు.. బాబు వస్తే.. ఇంటింటికీ జాబొస్తాదీ..."

– ఎన్నికల ప్రచార సమయంలో ఎక్కడికెళ్లినా.. చంద్రబాబు ఊదరగొట్టిన ప్రసంగమిదీ.

సాక్షి, విశాఖపట్నం : అధికారంలోకి రాకముందు ఒక మాట.. వచ్చిన తర్వాత మరో మాట.. ఇదీ చంద్రబాబు నైజం. ఎన్నికల ముందు ఒట్టేసి ఒక మాట.. ఒట్టెయ్యకుండా ఒక మాట చెప్పడు ఈ ఛత్రపతి అన్న రేంజ్‌లో.. నోటికొచ్చిన హామీలిచ్చి.. వాటిని తుంగలో తొక్కడం.. లేదంటే.. నిబంధనల చట్రంలో బందీలుగా మార్చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. తల్లులందరికీ వందనమంటూ వంగి వంగి నమస్కారాలు పెట్టిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక.. ఒక్క తల్లికే వందనమంటూ మాట మార్చేశారు.

ఇంటికో ఉద్యోగం వస్తుందా.?

నిరుద్యోగ భృతి లేదంటే ఇంటికో ఉద్యోగం ఇస్తానంటూ చంద్రబాబు హామీ ఇచ్చారు. జిల్లాలో మొత్తం ఇళ్ల సంఖ్యను బట్టి రెండు లక్షల మందికిపైగా ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉంది. కానీ గతంలో ఉద్యోగమంటూ ఊదరగొట్టి అందరికీ మొండిచెయ్యి చూపించిన చంద్రబాబు.. ఈసారీ అదే వైఖరి అవలంబిస్తారేమోనంటూ నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హామీలను నమ్మి ప్రతిసారీ చంద్రబాబు ప్రభుత్వం చేతిలో మోసపోతున్నామంటూ వాపోతున్నారు.

అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగం లేదా.. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పడంతో ఎదురు చూపులు చూస్తున్న నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచేందుకు సిద్ధమవుతోంది. అసలు భృతి ఇస్తారా ఇవ్వరా అనే సందేహాలు కూడా తలెత్తుతున్నాయి.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఉద్యోగాల వెల్లువ

2019–24 మధ్య కాలంలో ఉద్యోగాల జాతరే జరిగింది. విశాఖ జిల్లా పరిధిలో 6,500 మందికి సచివాలయ ఉద్యోగాలు కల్పించారు. అదేవిధంగా ఆప్కోస్ ద్వారా అవుట్‌సోర్సింగ్ కింద 40 వేల ఉద్యోగాలిచ్చారు. కాంట్రాక్టు పద్ధతిలో 1500కి పైగా ఉద్యోగాలు పొందారు. దీంతో పాటు జాబ్‌మేళాలు, రాష్ట్రంలో ప్రారంభమైన ఫార్మా, ఉత్పత్తుల కంపెనీల్లో రూ.50 వేల మందికి పైగా ఉపాధి అవకాశాలు పొందారు. వీరితో పాటు సొంత ఊరిలో రూ.5 వేల గౌరవ వేతనం పొందుతూ 15 వేల మందికి పైగా నిరుద్యోగులు వలంటీర్లుగా సేవలందించారు. ఇలా ఐదేళ్ల కాలంలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ సొంతం చేసుకుంది.



2014లోనూ అదే అబద్ధం

2014 ఎన్నికల్లోనూ అదే అబద్ధంతో చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. నాలుగున్నరేళ్ల పాటు సాగదీసిన తర్వాత.. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో తెరపైకి తీసుకొచ్చారు. తొలుత ఇంటింటికీ ఉద్యోగం.. లేకుంటే ప్రతి నిరుద్యోగికి రూ.2 వేల భృతి అని ప్రకటించి.. చివరికి రూ.1000 మాత్రమే ఇస్తామన్నారు. పోనీ.. అదైనా నిరుద్యోగులందరికీ సక్రమంగా ఇచ్చారా అంటే.. అందులోనూ రోజుకో కొత్త నిబంధన తీసుకొచ్చి.. నిరుద్యోగులకు ముచ్చెమటలు పట్టించారు. కుటుంబంలో ఎవరికీ ప్రభుత్వ ఉద్యోగం ఉండకూడదనీ, రూ.50 వేలకు మించి రుణం ఉండకూడదంటూ సవాలక్ష ఆంక్షలు విధించారు. ఈ కారణంగా అనేక మంది నిరుద్యోగులకు ఈ పథకం అందని ద్రాక్షగానే మారింది. క్రమంగా వివిధ కారణాల సాకులతో నిరుద్యోగులను భృతి జాబితా నుంచి తొలగించడంతో అందరి ఆశలూ గల్లంతయ్యాయి.

2014-19లో జిల్లాలోని నిరుద్యోగులను మోసం చేసిందిలా...

వెబ్‌సైట్‌లో నిరుద్యోగుల దరఖాస్తులు	11,67,179
ఓటీపీ జనరేట్ అయిన వారు	1,03,011
భృతికి అర్హత సాధించిన నిరుద్యోగులు	35,818
ఫిబ్రవరి 2019లో భృతి పొందిన నిరుద్యోగులు	28,383
మార్చిలో భృతి పొందిన నిరుద్యోగులు	28,495

నెల గడిచినా ఊసెత్తని సర్కారు..!



మరోసారి ఇంటికో ఉద్యోగం లేదంటే నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చి నెల రోజులు దాటుతున్నా.. దీనిపై కనీసం సమీక్ష చేయడం గానీ.. అధికారులకు ఆదేశాలు జారీ చేయడంగానీ జరగలేదు. జిల్లాలోని 11 మండలాల పరిధిలో 5.45 లక్షల ఇళ్లు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ, లిమిటెడ్ కంపెనీల పరిధిలోనూ, ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్న వారి సంఖ్య సుమారు 3.40 లక్షల మంది ఉంటారు. అంటే మిగిలిన 2.05 లక్షల ఇళ్లలో ఉన్న నిరుద్యోగులకు భృతి ఇవ్వాల్సి ఉంటుంది. అంటే మొత్తం నిరుద్యోగులు దాదాపు 4.5 లక్షల మంది ఉండే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వీరందరికీ రూ.3 వేలు చొప్పున ప్రతి నెలా నిరుద్యోగ భృతి ఇవ్వాల్సి ఉంటుంది. అంటే.. ప్రతి నెలా జిల్లాలో ఉన్న నిరుద్యోగులకు రూ.135 కోట్లకు పైగానే భృతి అందించాలి.

భృతి ఎప్పుడు ఇస్తారో..?



నేను డిగ్రీ పూర్తి చేశాను. ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాను. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నా. రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన చేపట్టే వరకూ నెలకు రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి నేతలు ఎన్నికల ముందు పదేపదే ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ భృతిపై సీఎం చంద్రబాబు ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం అనుమానం కలుగుతోంది. నాకు ఉద్యోగం వచ్చే వరకూ నిరుద్యోగ భృతి ఇస్తే ఆర్థిక భరోసా ఇచ్చినట్టువుతుంది. భృతి ఎప్పటి నుంచి ఇస్తారో స్పష్టమైన ప్రకటన ఇవ్వాలి.

– పి.బ్రహ్మాజీ, పెదగంట్యాడ

వాగ్దానం నిలబెట్టుకోవాలి



కూటమి ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తానని వాగ్దానం చేశారు. ఇంటికో ఉద్యోగం కూడా ఇస్తానన్నారు. ఆ హామీలకు ఆకర్షితులయ్యాం. మేనిఫెస్టోలో విద్యార్హతలు ప్రస్తావన లేనేలేదు. టీచర్ ట్రైనింగ్ పూర్తి చేశాను. ఈ ఏడాది డీఎస్సీ భర్తీ చేస్తామన్నారు. ఇప్పుడు అది వచ్చే ఏడాదికి వెళ్లిపోయింది. ఉద్యోగం మాటెలా ఉన్నా కనీసం నిరుద్యోగ భృతి అయినా ఇవ్వండి. ఉద్యోగం వచ్చినంత వరకు కొంత భరోసాగా ఉంటుంది.

– ఎస్ తేజశ్రీ, జాషువానగర్, కంచరపాలెం.

నమ్మాం.. మోసం చేయొద్దు..



కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతిపై ఇప్పటి వరకు ఎటువంటి ప్రకటన చేయకపోవడం దారుణం. భృతి వస్తుందనే ఆశతో నాతో పాటు స్నేహితులతో కూటమికి ఓటు వేయించాను. మెగా డీఎస్సీ పేరిట టెట్‌ను ఇప్పటికే మూడు సార్లు తేదీలు మార్చుతూ అక్టోబర్‌లోకి మార్చారు. మేనిఫెస్టోలో నిరుద్యోగులకు ప్రతినెలా రూ. 3 వేలు ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం సత్వరమే నిరుద్యోగ భృతిని ప్రకటించాలి.

– ఎం.సాయికనకవల్లి, డిగ్రీ, గొల్లకంచరపాలెం

ఆ ఆశతో మద్దతు తెలిపాం



కూటమి ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీ నమ్మి నాతో పాటు స్నేహితులు కూడా మద్దతు తెలుపుతూ ఓట్లు వేశాం. బీటెక్ మెకానికల్ పూర్తి చేశాను. కానీ ఎక్కడ ఉపాధి లభించలేదు. భృతి అందితే కొంత వరకు ఆర్థిక కష్టాలు గట్టెక్కుతాయి. పోటీ పరీక్షలకు కొంత ఆసరాగా ఉంటోంది. ఎంటెక్ పూర్తి చేసేందుకైనా దోహదపడుతుంది.

– చైతన్యకుమార్, బీటెక్, మల్కాపురం

జాబ్ వచ్చే వరకు ఇవ్వాలి



నేను ఎంఏ జర్నలిజం కోర్సు పూర్తి చేశాను. ప్రస్తుతం ఇంటి దగ్గర ఉండి ప్రభుత్వ ఉద్యోగం కోసం సన్నద్ధమవుతున్నాను. ఎన్నికల ముందు టీడీపీ నిరుద్యోగ భృతి ఇస్తుందని హామీ ఇచ్చింది. ఉద్యోగం వచ్చేంత వరకు భృతి ఆసరాగా ఉంటుందని ఆశిస్తున్నా. హామీ మేరకు తక్షణం పథకం అమలు చేయాలి.

– బండారు కిరణ్‌కుమార్, గొటివాడ కాలనీ, సబ్బవరం

ఐదేళ్లూ పక్కాగా ఇవ్వాలి



ఇప్పటి నుంచి నిరుద్యోగ భృత్తి ఐదేళ్ల పాటు ఇవ్వాలి. మధ్యలో నిరుద్యోగులను వదిలేయకూడదు. గతంలో 2014–2019లో చంద్రబాబు ఇలాగే ఆఖరి ఏడాదిలో మూడు నెలలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. ఈసారి కచ్చితంగా అమలు చేసి, మాట నిలబెట్టుకోవాలి.

– రాజు ఎంఏ, వెలంపేట జీవీఎంసీ 35వ వార్డు

భృతితో ఆదుకోవాలి



కూటమి నాయకులు ఎన్నికల హామీల్లో ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు ఇచ్చి అండగా నిలవాలి. అంతే కాకుండా జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగులను ఆదుకోవాలి. ఇంటర్మీడియట్, ఐటీఐ పూర్తి చేసి కుటుంబానికి ఆసరాగా ఉండటానికి చిన్నపనులు చేస్తున్నాను.

– చెల్లుబోయిన రమేష్, బాలాజీనగర్

తిరుమల భక్తులకు శుభవార్త

- విశాఖ నుంచి రోజూ ప్రత్యేక టూర్ ప్యాకేజీ తీసుకొస్తున్న పర్యాటక శాఖ
- 30 స్లీపింగ్ బెర్తులతో ఏసీ బస్సుల ఏర్పాటు
- 19న తొలి సర్వీస్ ప్రారంభం



విశాఖ సిటీ : తిరుమల ప్రయాణికులకు శుభవార్త. ఇబ్బందులు లేకుండా తిరుమలేశుని దర్శనం చేసుకొనే భాగ్యాన్ని పర్యాటక శాఖ కల్పించనుంది. ఇందుకోసం విశాఖ నుంచి రోజూ తిరుమలకు ప్రత్యేక టూర్ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకొస్తోంది. ఈ నెల 19 నుంచి 30 స్లీపింగ్ బెర్తులతో ఏసీ బస్సు అప్పుఘర్ నుంచి బయలుదేరనుంది. తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లాలని ప్రతి ఒక్కరూ ప్రయత్నిస్తూనే ఉంటారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆన్‌లైన్ ద్వారా టికెట్లు రిలీజ్ చేసే రోజు ప్రతి ఒక్కరూ కంప్యూటర్, మొబైల్‌కు అతుక్కుపోతారు. టికెట్ల కోసం అదృష్టాన్ని పరీక్షించుకుంటూ ఉంటారు. దేశవ్యాప్తంగా భక్తులు టికెట్ల కోసం పోటీ పడడంతో చాలా మందికి టికెట్లు దొరికే పరిస్థితి ఉండదు. అయితే త్వరలో విశాఖ వాసుల కోసం పర్యాటక శాఖ సరికొత్త టూర్ ప్యాకేజీ అందుబాటులోకి తీసుకొస్తోంది.

రోజూ ప్రత్యేక బస్సు సర్వీసు

విశాఖ నుంచి తిరుపతికి 30 స్లీపింగ్ బెర్త్‌లతో (ఏసీ స్లీపర్) బస్సు ఏర్పాటు చేస్తోంది. ఈ నెల 19న మధ్యాహ్నం 3 గంటల నుంచి రోజూ ఈ సర్వీసు అందుబాటులోకి రానుంది. రోజూ అప్పుఘర్ యాత్రి నివాస్ హోటల్ (హరిత టూరిజం హోటల్) నుంచి ప్రారంభమై ఎంవీపీ కాలనీ, మద్దిలపాలెం, ఆర్టీసీ కాంప్లెక్స్, ఎన్ఏడీ జంక్షన్, గాజువాక, అనకాపల్లి, రాజమండ్రి, శ్రీకాళహస్తి మీదుగా తిరుపతి చేరుకుంటుంది. ఈ టూర్ ప్యాకేజీలో భాగంగా పెద్దలకు రూ.6300, పిల్లలకు రూ.6 వేలు చార్జ్ చేయనున్నారు. 19న తొలి సర్వీసును జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఏపీటీడీసీపీ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్ పాణి ప్రారంభించనున్నారు. టికెట్లను ఏపీటీడీసీ వెబ్‌సైట్ ద్వారా, లేదా 8897464333 (మార్కెటింగ్), సీఆర్‌వో 9848813584 నంబర్ ద్వారా ప్రయాణానికి వారం రోజులు ముందుగా బుక్ చేసుకోవాలని ఏపీటీడీసీ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్‌పాణి తెలిపారు.

టూర్ సాగేది ఇలా...

- మొదటి రోజు విశాఖ నుంచి మధ్యాహ్నం 3 గంటలకు ప్రయాణం.
- రెండో రోజు శ్రీకాళహస్తి హరిత హోటల్‌లో ఫ్రెషఅప్, అల్పాహారం.
- అనంతరం అదే రోజు తిరుపతి దర్శనం, ఏపీటీడీసీ శ్రీనివాసం హోటల్‌లో మధ్యాహ్నం భోజనం.
- అదే రోజు తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ దర్శనం, అనంతరం శ్రీకాళహస్తిలో హరిత హోటల్‌లో రాత్రి భోజనం.
- భోజనం అనంతరం విశాఖకు తిరుగు ప్రయాణం.
- మూడో రోజు ఉదయం 9 గంటలకు విశాఖ చేరుకోవడంతో టూర్ ముగుస్తుంది.

కేజీహెచ్‌లో సమూల మార్పులు



మాట్లాడుతున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య ప్రసాద్, కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు, వైద్యులు

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యప్రసాద్

మహారాణిపేట: సమాజంలో అన్ని వృత్తుల కంటే వైద్య వృత్తి చాలా గొప్పదని, అటువంటి వృత్తిని సేవా దృక్పథంతో చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై.సత్య ప్రసాద్ వైద్యులకు పిలుపునిచ్చారు. సోమవారం కేజీహెచ్ సమావేశ మందిరంలో వైద్యాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రైవేటు ఆస్పత్రుల వైపు రోగులు మొగ్గు చూపకుండా ఉండాలంటే ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. 68 లక్షల మందికి ఆరోగ్య శ్రీ ద్వారా స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించనున్నామని తెలిపారు. అలాగే రాష్ట్రంలో కొత్తగా 12 వైద్య కళాశాలలు నిర్మించనున్నామని, ఇందుకు అవసరమైన మ్యాచింగ్ గ్రాంట్ నిధులు సమీకరణ కోసం ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. అందరి సహకారంతో కేజీహెచ్ సమూల మార్పునకు శ్రీకారం చూడదామన్నారు. ఎంపీ ఎం. శ్రీభరత్ మాట్లాడుతూ ఇకపై కేజీహెచ్ ఏ నిర్మాణం చేపట్టినా 50 ఏళ్లను దృష్టిలో పెట్టుకుని నిర్మించాలన్నారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర నుంచే కాకుండా ఒడిశా నుంచి వచ్చే రోగులకు కూడా వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఉత్తర శాసనసభ్యులు పి. విష్ణుకుమార్ రాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు , ఎస్. కోట ఎమ్మెల్యే కె.లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో దివ్యాంగుడి దారుణ హత్య

- స్థలం వివాదమే కారణం
- పోలీసుల అదుపులో నిందితులు



రక్తపు మడుగులో అప్పలనాయుడు (ఇన్‌సెట్) అప్పలనాయుడు (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: గాజువాక జగ్గు జంక్షన్ సమీపంలో సోమవారం రాత్రి దారుణ హత్య జరిగింది. దివ్యాంగుడైన వ్యక్తిని ఇద్దరు దుండగులు వెంబడించి గొంతుకోసి హత్య చేశారు. మృతుడు వేమిరెడ్డి అప్పలనాయుడుగా పోలీసులు గుర్తించారు. భూవివాదాల నేపథ్యంలో ఈ హత్య చోటుచేసుకుందని తెలిపారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజువాకలోని జగ్గు జంక్షన్ శ్రీ కృష్ణదేవరాయ కల్యాణ మండపం పక్కన నివాసముంటున్న వేమిరెడ్డి అప్పలనాయుడు (40) ఆర్మీలో పనిచేసి రిటైర్ అయ్యాడు. ఉద్యోగ సమయంలో అనారోగ్యానికి గురై దివ్యాంగుడయ్యాడు. ఆయన అదే ప్రాంతానికి చెందిన బంక రాము అనే వ్యక్తికి స్థలం విక్రయించాడు. ఈ స్థల విషయమై ఇరువురి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రాము తన అన్న కొడుకు అశోక్‌పాత్రుడితో కలిసి సోమవారం రాత్రి 8.30 గంటల సమయంలో స్కూటీపై ఇంటి నుంచి వస్తున్న అప్పలనాయుడిపై జగ్గు జంక్షన్ సమీపంలోని శ్రీ కృష్ణానగర్ వద్ద కత్తులతో దాడి చేశారు. అప్పలనాయుడు తప్పించుకొని పరుగులు పెట్టగా.. ఇద్దరు వెంటపడి చేతులపై పొడిచి, గొంతు కోసి దారుణంగా హత్య చేశారు. అనంతరం నిందితులిద్దరూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయారు. సమాచారం అందుకున్న గాజువాక సీఐ శ్రీనివాసరావు, సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

అంతర జిల్లాల స్విమ్మింగ్‌లో రన్నరప్ విశాఖ



రన్నరప్‌గా నిలిచిన విశాఖ ఆటగాళ్లు

విశాఖ స్పోర్ట్స్ : ఏపీ సబ్‌జూనియర్, జూనియర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్, సెలక్షన్ ట్రయల్స్ పోటీల్లో విశాఖ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ పోటీలు కర్నూలు జిల్లాలో జరగ్గా విశాఖ జట్టు 101 పాయింట్లు సాధించింది. సత్తా చాటిన స్విమ్మర్లను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయగా వీరంతా ఆగస్టు 6 నుంచి భువనేశ్వర్‌లో జరిగే అంతరరాష్ట్ర పోటీల్లో పాల్గొనున్నారు. అంతర జిల్లాల పోటీల్లో గణేష్ చక్రధర్, జిషి తేష్, ప్రియేష్, సౌరవ్, సంజయ్, వైభవ్, నిష్టా, ప్రహర్షిణి, సరయు, అనన్య, అంజలి, హైందవి సత్తా చాటి పతకాలు సాధించారు.

ఊపిరాడక చిన్నారి మృతి


చిన్నారి మృతదేహం

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు బాలాజీనగర్‌లో సోమవారం ఉదయం కూలర్ గాలికి ఊపిరి ఆడక తొమ్మిది నెలల చిన్నారి మృతి చెందిన విషాద సంఘటన చోటుచేసుకుంది. శ్రీకాకుళం జిల్లా రణస్థలానికి చెందిన గంట్యాడ ఉమా మహేష్ భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీలో పనిచేస్తూ తగరపువలసలో కుటుంబంతో నివసిస్తున్నారు. ఆయనకు భార్య, రెండేళ్ల, తొమ్మిది నెలల వయసు గల కుమార్తెలు ఉన్నారు. రెండు రోజులుగా చిన్న కుమార్తెకు జలుబుగా ఉండడంతో వైద్యం చేయిస్తున్నారు. బాలిక తల్లి సోమవారం ఉదయం స్నానం చేయించి కూలర్ వద్ద పడుకోబెట్టింది. కాసేపటి తర్వాత చూస్తే బాలిక చలనం కోల్పోయింది. దీంతో బాలాజీనగర్‌లో విషాదం నెలకొంది. చుట్టుపక్కల నుంచి పలువురు బాలికను చూసి చలించిపోయారు. వెంటనే చనిపోయిన బాలికను తీసుకుని తల్లిదండ్రులు వారి స్వస్థలానికి వెళ్లిపోయారు. దీనిపై వైద్యులు మాట్లాడుతూ బాలిక శరీరంలో టెంపరేచర్ తగ్గిపోయి చనిపోయి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. దీనిపై బాలిక వివరాలు, మిగిలిన విషయాలు తెలియాల్సి వుంది.

జీవీఎంసీ పీజీఆర్ఎస్‌కు 95 వినతులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు (పీజీఆర్ఎస్) 95 వినతులు అందాయి. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మేయర్ హరి వెంకటకుమారి, అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్‌తో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో జోన్-1 నుంచి ఒకటి, జోన్-2కు 15, జోన్-3కు 26, జోన్-4కు 12, జోన్-5కు 12, జోన్-6 కు 12, జోన్-8కి 10 ఫిర్యాదులు అందగా, జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సంబంధించి 7 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు, ప్రధాన సిటీ ప్లానర్ సురేష్‌కుమార్, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీపీ

విశాఖ సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 110 ఫిర్యాదులు వచ్చాయి. సీపీతో పాటు జాయింట్ సీపీ ఫకీరప్ప, ఇతర ఉన్నతాధికారులు ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటిపై వెంటనే సంబంధిత స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సత్వరమే పరిష్కరించాలని చెప్పారు.

దివ్యాంగ్ సురక్షకు నాలుగు కాల్స్

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి నిర్వహించిన కార్యక్రమంలో దివ్యాంగ్ సురక్ష టోల్‌ఫ్రీ నంబర్‌కు నలుగురు దివ్యాంగులు నుంచి కాల్స్ వచ్చాయి. సైన్ లాంగ్వేజ్ తెలిసిన నిపుణురాలి ద్వారా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో ముగ్గురు కృతజ్ఞతాపూర్వకంగా కాల్ చేయగా.. ఒకరు తనకు మార్చి నెల వేతనం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై సంబంధిత అధికారితో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సీపీ చెప్పారు.

సమస్యలు పరిష్కరించి.. ప్రగతి సాధించాలి

కలెక్టర్ హరేందిర ప్రసాద్


మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, చిత్రంలో జేసీ మయూర్ అశోక్, జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్, డీఆర్వో మోహన్ కుమార్

మహారాణిపేట: వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న సమస్యలను అధిగమించి, ప్రగతి సాధించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతి, పెండింగ్ సమస్యల పరిష్కారంతో పాటు కారుణ్య నియామకాలపై కలెక్టర్ శాఖల వారీగా సమీక్షించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముందు కలెక్టర్ జిల్లా అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో కొన్ని చోట్ల తాగునీరు, మురుగు సమస్య ఉందని తమ దృష్టికి వచ్చిందన్నారు. వాటిపై సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డీడీ, సోషల్ వెల్ఫేర్ అధికారులను ఆదేశించారు. నిత్యావసర సరుకులను సకాలంలో విడిపించి, మండల స్థాయి నిల్వ కేంద్రాల్లో ఉంచాలని, రిజిస్టర్ ప్రకారం అన్ని సక్రమంగా ఉన్నదీ లేనిదీ పరిశీలించి పంపిణీ చేయాలని జిల్లా పౌసరఫరాల అధికారిని ఆదేశించారు. పీఎం విశ్వకర్మ యోజన పథకానికి భారీగా దరఖాస్తులు వస్తున్న నేపథ్యంలో వాటిని క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల అంశంపై మాట్లాడుతూ తగిన చర్యలు చేపట్టాలని ఈపీడీసీఎల్ ఎస్ఈని ఆదేశించారు. టిడ్కో గృహ సముదాయాల్లో రహదారులు, విద్యుత్, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

ఖాళీల వివరాలు అందజేయండి

జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను తక్షణమే అందజేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. కారుణ్య నియామకాలకు సుమారు 80 వరకు దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని భర్తీ చేసేందుకు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను నిర్దిష్ట పట్టిక ద్వారా తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్, జీవీఎంసీ, పోలీస్ అధికారులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

261 వినతుల స్వీకరణ

సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు మొత్తం 261 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు 104 ఉండగా, జీవీఎంసీకి 77 ఉన్నాయి. అలాగే పోలీసు శాఖకు సంబంధించి 9 వినతులు రాగా, ఇతర విభాగాలకు సంబంధించి 71 వచ్చాయి.

నీటి మాఫియాపై చర్యలు తీసుకోండి

నగర శివారు ప్రాంతాల్లో అనధికారికంగా బోర్లను వేసి వ్యాపారం చేస్తున్న నీటి మాఫియాదారులపై చర్యలు తీసుకోవాలని ఆర్‌టీఏ యాక్టు సామాజిక కార్యకర్త శరత్ కోరారు. కాపులుప్పాడ, తిమ్మాపురం ప్రాంతాల్లో కొంత మంది అనధికార బోర్లు వేస్తున్నారని, రోజుకు లక్షాల్లో అక్రమ వ్యాపారం జరుగుతోందని, దీనిని నివారించాలని ఆయన కోరారు. ఈ మేరకు జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావుకు ఆయన వినతిపత్రం అందజేశారు.

అధికారుల్లో జవాబుదారీతనం ఉండాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీదారుల సమస్యలకు జవాబుదారీతనం ఉండాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులకు సూచించారు. ఫిర్యాదుదారుడు సంతృప్తి చెందేలా సమస్య పరిష్కరించాలన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్‌తో అధికారులు అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయా విభాగాల జిల్లాస్థాయి అధికారులు తప్పకుండా అర్జీదారులతో మాట్లాడాలని, సమస్య పూర్వాపరాలు తెలుసుకొని సరైన పరిష్కారం చూపాలని తెలిపారు. సంబంధిత విభాగాల పరిధిలో నమోదైన ఫిర్యాదులను పూర్తిగా పరిశీలించి, అర్జీదారులకు ఫోన్ చేసి మాట్లాడాలని, వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జీవీఎంసీ ఏడీసీ విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఏసీపీ టీ.ఎస్.ఆర్.కె.ప్రసాద్ పాల్గొన్నారు.

తుప్పల్లో శిశువు మృతదేహం

పరవాడ: మండంలోని దేశపాత్రుని పాలెం శివారు సాయినగర్ కాలనీ సమీపంలో తుప్పల్లో సోమవారం మగ శిశువు మృతదేహం లభించింది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పరవాడ సీఐ ఎస్.బాల సూర్యారావు అందించిన వివరాల ప్రకారం.. అప్పుడే పుట్టిన మగ శిశువు మృతదేహాన్ని సాయినగర్‌కాలనీ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు తుప్పల్లో విసిరి వెళ్లిపోయారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ బాలసూర్యారావు చెప్పారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో మలేరియా, డెంగీతో పాటు అతిసార వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సోమవారం తన చాంబర్లో జీవీఎంసీ అదనపు కమిషనర్ (డెవలప్‌మెంట్) కేఎస్ విశ్వనాథన్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి సీజనల్ వ్యాధులు, స్టాప్ డయేరియా క్యాంపైన్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పరిధిలో సీజనల్ వ్యాధులు, అతిసార వ్యాధి వ్యాప్తి చెందకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత, సురక్షిత తాగునీరు, కాలువలు, గెడ్డల్లో పూడికల తొలగింపు తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దోమల నియంత్రణకు ఫాగింగ్, స్ప్రేయింగ్ వాటిపై వివరాలను డీఎంవో తులసిని, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉన్నందున ప్రతి ఫ్రైడే డ్రైడే పాటించేటట్టు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి జ్వర పీడితులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'పేకమేడలు'

- సందడి చేసిన చిత్ర యూనిట్

డాబాగార్డెన్స్: పేకమేడలు సినిమా యూనిట్ విశాఖలో సందడి చేసింది. నా పేరు శివ ఫేమ్ వినోద్ కిషన్ హీరోగా, అనూష కృష్ణ హీరోయిన్‌గా, నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో రాకేష్ వర్రె నిర్మాణంలో యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా చిత్రం రూపుదిద్దుకుందని చిత్ర యూనిట్ తెలిపింది. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా సోమవారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ ఈ సినిమా ఈ నెల 19న విడుదల కానుందని చెప్పారు. స్మారన్ మంచి సంగీతం అందించారని, సినిమా బ్యాక్ గ్రౌండ్ స్కోర్ బాగా ఇచ్చారన్నారు. తనకు హీరోగా ఇది తొలిసినిమా అని, ఈ సినిమా తప్పకుండా విజయవంతమవుతుందన్న నమ్మకం ఉందన్నారు. హీరోయిన్ అనూషకృష్ణ మాట్లాడుతూ తనకు తెలుగులో ఇది తొలి చిత్రమని, గతంలో కన్నడ సినిమాలు చేశానన్నారు. సింహాచలం స్వామి ఆశీస్సులు తీసుకున్నామని, సినిమా తప్పకుండా విజయవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నిర్మాత రాకేష్ వర్రే తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథుడి తిరుగు ప్రయాణం


పూజలందుకుంటున్న జగన్నాథస్వామి

బీచ్‌రోడ్డు: ఉత్కల్ సమాజ్ ఆధ్వర్యంలో సోమవారం జగన్నాథ స్వామి తిరుగు ప్రయాణ శోభ యాత్ర ఘనంగా జరిగింది. లాసన్స్ బే కాలనీలో ప్రారంభమైన యాత్ర వుడా పార్క్, పార్క్ హోటల్, చిన్నవాల్తేరు, ఏయూ గేటు, సిరిపురం మీదగా దసపల్లహిల్స్‌లోని జగన్నాథస్వామి ఆలయానికి చేరుకుంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగారు. ఈ సందర్భంగా ఉత్కల్ సమాజ్ అధ్యక్షుడు నాయక్ మాట్లాడుతూ 9 రోజుపాటు ప్రత్యేక పూజలు అందుకున్న జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రదేవి తిరిగి తమ ఇంటికి చేరుకున్నారన్నారు.

బ్యాంకర్స్ క్రికెట్ టోర్నీ విజేత పీఎన్‌బీ జట్టు


ట్రోఫీతో పంజాబ్ నేషనల్ బ్యాంకు జట్టు

తగరపువలస: బ్యాంకర్స్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా పంజాబ్ నేషనల్ బ్యాంకు జట్టు నిలిచింది. చిట్టివలస మెడోస్ క్రీడా మైదానంలో ఇటీవల ప్రారంభమైన ఈ టోర్నీలో జిల్లా నుంచి 12 బ్యాంకుల జట్లు తలపడ్డాయి. సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో యూనియన్ బ్యాంక్‌పై 9 వికెట్ల తేడాతో పంజాబ్ నేషనల్ బ్యాంకు విజయం సాధించి, ట్రోఫీ, నగదు బహుమతి గెలుచుకుంది. ఈ కార్యక్రమంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ విశాఖ ఏజీఎంలు జంబల ప్రదీప్, ఎ.శివకుమార్, కెప్టెన్ కె.శివ ప్రసాద్, ఇతర బ్యాంకుల సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తాం

- అరకు ఎంపీ డాక్టర్ తనూజారాణి


అరకు ఎంపీ తనూజారాణిని సత్కరిస్తున్న గిరిజన సంఘాల ప్రతినిధులు

డాబాగార్డెన్స్ : గిరిజనుల అభివృద్ధికి శక్తివంచన లేకుండా తనవంతు బాధ్యతగా కృషి చేస్తానని అరకు పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ తనూజా రాణి తెలిపారు. ఇటీవల ఎన్నికల్లో విజయం సాధించిన పాడేరు, అరకు ఎమ్మెల్యేలు, అరకు ఎంపీని నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం గిరిజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అరకు ఎంపీ తనూజా రాణి మాట్లాడుతూ గిరిజనులకు నష్టం కలిగించే జీవో 3పై పార్లమెంట్‌లో చర్చించి గిరిజనాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆదివాసీల హక్కుల సాధనకు రాజీలేని పోరాటం చేస్తామన్నారు. అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో మైదాన ప్రాంతాల నుంచి వచ్చి వ్యాపారులు, ఇతర ప్రాంతాల వారు అధికంగా ఉన్నారని, వారి నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. గిరిజన ప్రాంత అభివృద్ధికై అసెంబ్లీలో అన్ని అంశాలపై చర్చించి ప్రభుత్వం నుంచి నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. అనంతరం వచ్చే నెల 9న నిర్వహించనున్న ప్రపంచ గిరిజన దినోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల ప్రతినిధి లకే చిట్టిబాబు, విశాఖ జిల్లా గిరిజన ఐక్యవేదిక ముఖ్య సలహాదారుడు కె.రామారావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు కొక్కుల రామారావు, ఆత్మతృప్తి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు అంబిడి రాజయ్య, గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చిత్తయ్య, బహుజన టీచర్స్ జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, గిరి జాగృతి సంఘం అధ్యక్షుడు మోరి సింహాచలం, జిల్లా గిరిజన సంఘం అధ్యక్షుడు అంబటి కోటీశ్వరరావు, స్టీల్‌ప్లాంట్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకుడు తొడన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిల హంగామా


నడిరోడ్డుపై అర్ధనగ్నంగా..


భయపెట్టే చూపులు


ట్రిపుల్ రైడింగ్‌తో విద్యార్థుల హల్‌చల్

ఆకతాయిలకు హద్దూ అదుపూ లేకుండా పోతోంది. బుల్లయ్య కళాశాల ప్రాంతంలో వీరంగం సృష్టిస్తున్నారు పోకిరీలు. బైక్ స్టంట్స్ చేస్తున్నారు. పుట్టిన రోజు వేడుకలంటూ ఈ ప్రాంతంలో అలజడి సృష్టిస్తున్నారు. కొంతమంది విద్యార్థులు మాదకద్రవ్యాలు సేవించి ఇష్టానుసారం చెలరేగిపోతున్నారు. రోడ్డుపై అర్ధనగ్నంగా డ్యాన్స్‌లు చేస్తూ..బైక్‌పై ఫీట్లు చేస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఆ రోడ్డులో వెళ్లాలంటేనే మహిళలు, విద్యార్థినులు బెంబేలెత్తిపోతున్నారు. ఇంట్లో బుద్ధిమంతుల్లా ఉంటూ రోడ్డెక్కితే చెలరేగిపోతున్నారు. తల్లిదండ్రులూ.. ఈ ఫొటోల్లో మీ పిల్లలుంటే జాగ్రత్త చెప్పండి..లేదంటే చేయిదాటిపోయే ప్రమాదం ఉంది.

–ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

నిబంధనలు మీరితే చర్యలు



సీతంపేటలో ఫుత్‌పాత్‌ను ఆక్రమించిన ఎంపీ గారి తాలుకా 2కే బిర్యానీస్ దుకాణదారులను హెచ్చరిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ భాస్కరరావు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన స్టాళ్లు, దుకాణాలపై సోమవారం ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. 'నిబంధనలకు తూట్లు' శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. సీతంపేట, ఆశీలమెట్ట, గురుద్వారా తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన ఫాస్ట్‌ఫుడ్ షాపులు, తోపుడుబళ్లను ద్వారకా ట్రాఫిక్ ఎస్‌ఐ భాస్కరరావు పరిశీలించి, వాటిని తీయాలని సూచించారు. పాదచారులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాల రాంగ్ పార్కింగ్ చేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

Karur Vysya Bank — ది కరూర్ వైశ్యాబ్యాంకు లిమిటెడ్

డివిజనల్ ఆఫీస్ : విశాఖపట్నం. డి.నెం.47-10-15, మొదటి అంతస్తు, ఎ.జి.ఎవెన్యూ, పొలాక్స్ స్కూల్ ఎదురుగా, 2వ లేన్, ద్వారకానగర్, విశాఖపట్నం-16

స్వాధీనత ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 యొక్క రూల్ 8(1))

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (రెండవ) యాక్ట్ 2002 (యాక్ట్ 54, 2002) ప్రకారం **ది కరూర్ వైశ్యాబ్యాంక్ లిమిటెడ్, ద్వారకానగర్ బ్రాంచ్, విశాఖపట్నం** అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదివే సదరు సెక్షన్ 13(12) ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ ఋణగ్రహీతలు / హామీదారులు : 1) **శ్రీ బుద్ధ శ్రీనివాస్ సంతోష్ ప్రవీణ్ చంద్ర, తండ్రి. బుద్ధ సన్నా అప్పారావు**, ఫ్లాట్ నెం.12, డి.నెం.50-17-27/12, భావన ఎన్‌క్లేవ్ 2, రాజేంద్ర నగర్, ప్రిజమ్ డిగ్రీ కాలేజ్ దగ్గర, విశాఖపట్నం-530016. 2) **శ్రీమతి బుద్ధ శారద, భర్త. బుద్ధ సన్నా అప్పారావు**, డి.నెం.9-2-91/2, రింగ్ రోడ్డు, ఎన్‌టీఆర్ మార్కెట్ యార్డ్ దగ్గర, అనకాపల్లి-531001. 3) **శ్రీ మెట్టు రాజు, తండ్రి. యోగి రెడ్డి**, డి.నెం.11-2-376, బస్టాండ్ బజార్, మాచర్ల, గుంటూరు-522426. మరొక చిరునామా : **శ్రీ మెట్టు రాజు, తండ్రి. యోగి రెడ్డి**, ఫ్లాట్ నెం.205, గీతాంజలి, శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ప్రక్కన, రింగ్ రోడ్డు, అనకాపల్లి-531001 వారి బకాయి సొమ్ము **రూ.92,35,262.47 పై (అక్షరాల తొంభై రెండు లక్షల ముప్పై ఐదు వేల రెండు వందల అరవై రెండు రూపాయల నలభై ఏడు పైసలు మాత్రమే) (ఖాతా నెం.4815726000000011 కు రూ.81,62,636.07 పై + ఖాతా నెం. 4815296000000014 కు రూ.5,36,703.80 పై + ఖాతా నెం.1420296000000011 కు రూ.5,35,922.60 పై)** నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **తేది.18.04.2024** న డిమాండు నోటీసును జారీచేయబడినది.

ఋణగ్రహీత సదరు ఋణాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనారు. కావున ఋణగ్రహీతకు / హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా సదరు రూల్ 8 తో చదివే సదరు సెక్షన్ లోని సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ ఈ దిగువ సంతకందారు బ్యాంకునకు తనఖా ఉంచిన దిగువ వివరించిన ఆస్తిని **తేది.10.07.2024** న స్వాధీనం చేసుకున్నారు.

సాధారణ ప్రజానీకానికి ముఖ్యముగా ఋణగ్రహీతకు / హామీదారులకు జందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎవ్వరు ఎట్టి లావాదేవీలు జరుపరాదు. సదరు ఆస్తికి సంబంధించిన ఎట్టి లావాదేవీలైనను **రూ.95,12,079.47 పై (అక్షరాల తొంభై ఐదు లక్షల పన్నెండు వేల డెబ్బై తొమ్మిది రూపాయల నలభై ఏడు పైసలు మాత్రమే) (ఖాతా నెం. 4815726000000011 కు రూ.83,92,943.07 పై + ఖాతా నెం.4815296000000014 కు రూ.5,59,975.80 పై + ఖాతా నెం. 1420296000000011 కు రూ.5,59,160.60 పై) + తేది.21.06.2024** నుండి దానిపై వడ్డీ + ఖర్చులతో సహా **ది కరూర్ వైశ్యాబ్యాంక్ లిమిటెడ్, ద్వారకానగర్ బ్రాంచ్, విశాఖపట్నం** వారి ఛార్జికి లోబడి ఉంటాయి.

ఋణగ్రహీతలు సెక్యూర్డ్ ఆస్తి విడిపించుకొనుటకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలు గమనించగలరు.

స్థిరాస్తి వివరములు

అనకాపల్లి, అనకాపల్లి ఎస్.ఆర్.ఓ., జివిఎమ్‌సి యొక్క పరిధి, అనకాపల్లి టౌన్, సబ్బవరం రోడ్డు యొక్క పడమర వైపున, ఆర్ఎస్ వార్డు, సర్వే నెం.271/1బి నందు విస్తీర్ణం 319.40 చ॥గ॥లులోని (273.77 చ॥గ॥లు + 29.27 చ॥గ॥లు + 16.36 చ॥గ॥లు) స్థలం నందు అసెస్‌మెంట్ నెం.1087020717, డోర్ నెం.10-16-86/1 తో ఉన్న భూమి మరియు అందు భవనం శ్రీ బుద్ధ శ్రీనివాస్ సంతోష్ ప్రవీణ్ చంద్ర, తండ్రి. బుద్ధ సన్నా అప్పారావు గారి పేరున ఉన్న రిజిస్టర్డ్ అమ్మకం దస్తావేజు నెం.4808/2021, తేది.01.07.2021 మరియు ఎమ్.ఓ.డి నెం.11862/2022 ద్వారా మా బ్యాంక్ నుండి సెక్యూర్ చేయబడిన తేది.21.09.2022 ప్రకారం

ఐటమ్ నెం.1 : విస్తీర్ణం 273.77 చ॥గ॥లు / 228.90 చ॥మీ॥లులోని అసెస్‌మెంట్ నెం. 1087020717 మరియు డోర్ నెం.10-16-86/1 తో ఉన్న స్థలం మరియు అందు భవనం. హద్దులు : తూర్పు : పీల వెంకట జగ్గారావు గారి ఆస్తి, పడమర : దాడి అప్పారావు మరియు ఇతరులు యొక్క భూమి, ఉత్తరం : అనకాపల్లి నుండి సబ్బవరం వెళ్ళే రహదారిని కలుపుతూ 15 అ॥ల రోడ్డు మరియు పీల వెంకట జగ్గారావు గారి ఆస్తి, దక్షిణం : క్రింది ఐటమ్ నెం.2.

ఐటమ్ నెం.2 : విస్తీర్ణం 29.27 చ॥గ॥లులోని అసెస్‌మెంట్ నెం.1087020717 మరియు డోర్ నెం.10-16-86/1 తో ఉన్న స్థలం మరియు అందు భవనం. హద్దులు : తూర్పు : పీల వెంకట జగ్గారావు గారి ఆస్తి, పడమర : దాడి అప్పారావు మరియు ఇతరులు యొక్క భూమి, ఉత్తరం : పై ఐటమ్ నెం.1, దక్షిణం : క్రింది ఐటమ్ నెం.3.

ఐటమ్ నెం.3 : విస్తీర్ణం 16.36 చ॥గ॥లులోని అసెస్‌మెంట్ నెం.1087020717 మరియు డోర్ నెం.10-16-86/1 తో ఉన్న స్థలం మరియు అందు భవనం. హద్దులు : తూర్పు : పీల వెంకట జగ్గారావు గారి ఆస్తి, పడమర : దాడి అప్పారావు మరియు ఇతరులు యొక్క భూమి, ఉత్తరం : క్రింది ఐటమ్ నెం.2, దక్షిణం : పంట కాలువ.

ఐటమ్ 1 నుండి 3 యొక్క మొత్తం విస్తీర్ణం 319.40 చ॥గ॥లు.

తేది : 10.07.2024
స్థలం : విశాఖపట్నం

సం/- అధీకృత అధికారి,
ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్
ద్వారకానగర్ బ్రాంచ్, విశాఖపట్నం